## ల్యాబ్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి


జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్ కుమార్‌రెడ్డితో సమావేశమైన పీయూ వీసీ శ్రీనివాస్

● పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 7: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న వనపర్తి పీజీ సెంటర్‌లో ల్యాబ్‌ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయించేలా చూడాలని పీయూ వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లో జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డిని పీయూ వీసీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీయూ వీసీ మాట్లాడుతూ.. నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు మరింత మెరుగైన ల్యాబ్ సదుపాయాలు సమకూరుతాయన్నారు. తద్వారా మరింత నాణ్యమైన ఆధునిక సాంకేతికతతో కూడిన విద్య అందుతుందని పేర్కొన్నారు.

## సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవోలుగా ఎదగాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య రమేశ్‌బాబు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 7: పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సీఈవోలుగా ఎదగాలని పీయూ రిజిస్ట్రార్ ఆచార్య రమేశ్ బాబు సూచించారు. బుధవారం యూనివర్సిటీలో ఎంబీఏ విభాగంలో ద్వితీయ సంవత్సర సీనియర్ విద్యార్థులు మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగత మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. ప్రపంచంలో పేరెన్నికగన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సీఈవోలుగా చేసిన వాళ్లందరూ ఎంబీఏ చేసిన వాళ్లేనన్నారు. కష్టపడి చదివి సాఫ్ట్‌వేర్ స్కిల్స్ పెంపొందించుకుంటే ఎంబీఏ విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కోర్సు ప్రారంభంలోనే ఉన్నత విద్య చదవడానికి ఒక నిర్దిష్ట ప్రణాళికతో చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విభాగాధిపతి జావేద్‌ఖాన్, అర్జున్‌కుమార్, నాగసుధ, అరుంధతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకే తనిఖీలు

మక్తల్, మే 7: మత్తు పదార్థాల నిర్మూలనకే నార్కొటిక్ స్నైపర్ తనిఖీలు చేపడుతున్నట్లు నారాయణపేట డీఎస్పీ లింగయ్య పేర్కొన్నారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రాల్లో మత్తుపదార్థాలను నిర్మూలనలో భాగంగా బుధవారం మక్తల్‌లో నార్కొటిక్స్ స్నైపర్ పోలీసులు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాల రవాణా జరుగుతుందనే సమాచారం రావడంతో కిరాణా దుకాణాలు, అనుమానంగా పంటపొలాలు, పాన్ షాప్‌ల్లో ముమ్మరంగా తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం, రవాణా, సరఫరా చేసినా వారి సమాచారాన్ని వెంటనే 100 కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ బలరాం, నార్కొటిక్స్ స్నైపర్ డాగ్ విక్కీ, డాగ్ హ్యాండ్లర్ నరేందర్ తదితరులు ఉన్నారు.

## సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 7: రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేసి అర్హులైన ప్రతిఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య డిమాండ్ చేశారు. బుధవారం తమ కార్యాలయంలో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు సబ్సిడీ పొందాలంటే సిబిల్ స్కోర్ నిబంధన తప్పనిసరి పెట్టడంతో నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువ వికాసం పేరుతో నిరుద్యోగులకు ఆశ చూపి, సిబిల్ స్కోర్ నిబంధనతో నీళ్లు చల్లుతుందని విమర్శించారు. బ్యాంకు సంబంధం లేకుండా నేరుగా అర్హులకే సబ్సిడీ రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంటేశ్, శ్యాంసుందర్, శివకుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

నవాబ్‌పేట, మే 7: మండలంలోని ఇప్పటూర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను విశ్వకర్మ మండల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పల్లకీసేవ, అభిషేకం, హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు వెంకటయ్యాచారి, పాండురంగాచారి, వీరనారాయణచారి, మహేషాచారి, రామాచారి, కృష్ణాచారి, శివాచారి తదితరులు పాల్గొన్నారు.

*ఆలయ కమిటీ ఎన్నిక*

మమ్మదాబాద్, మే 7: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నిర్వహణ, అభివృద్ధి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ముందుగా గురుపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, కోశాధికారి యాదగిరి, ఉపాధ్యాక్షులు హనుమంతచారి, బేమనాథచారి, గోపాల్, గౌరవాధ్యక్షుడు కేశవాచారి ఎన్నికయ్యారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్

ఊట్కూర్, మే 7: ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు ఏవో గణేశ్‌రెడ్డి అధ్యక్షతన ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన డీఏవో మాట్లాడుతూ..ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 14 నెంబర్లతో కూడిన యూనికోడ్‌ను కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్రం ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడంతో ఈ ఫార్మర్ ఐడీని కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు రైతులకు ఎలాంటి చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదని, కేవలం రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఈ రైతులకు ఫార్మర్ ఐడీ కేటాయించడం జరుగుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుందని, పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడుత లబ్ధి పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిచిన పథకాలైన రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం ఉండదని తెలిపారు. ఫార్మర్ ఐడీ పొందుటకు రైతు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని సమీపంలోని మీసేవలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బాల్ రెడ్డి, ఏవో గణేశ్‌రెడ్డి, ఏఈవో చరణ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో జాన్ సుధాకర్

# వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

● కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 7: వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ విజయేందిరబోయి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ తాసీల్దార్ కార్యాలయంలో మొదటిసారిగా వృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణిలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ప్రజావాణికి మొత్తం 38 అర్జీలు, వినతులు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్డీవో భోజప్ప, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జరీనాబేగం, అర్బన్ తాసీల్దార్ ఘన్సీరాం, ఎల్‌డీఎం భాస్కర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబీషన్ అధికారి నర్సింహారెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాయకులు నాగభూషణం, బాలయ్య, మనోహర్‌రావు, రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు.

*ఇండ్లను త్వరితగతిన పూర్తిచేయాలి*

భూత్పూర్, మే 7: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. బుధవారం కలెక్టర్ మండలంలోని భట్టుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. 47ఇండ్లు మంజూరు కాగా, 31మంది పనులను ప్రారంభించా రు. ఇంటి పనులను ప్రారంభించనివారు త్వరలోనే ప్రారంభించాలని, లేదంటే ఇండ్లను క్యాన్సిల్ చేసి వేరే వాళ్లకు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. దశలవారీగా డబ్బులు మంజూర వుతాయని తెలిపారు.


ప్రత్యేక ప్రజావాణిలో కలెక్టర్‌కు సమస్య నివేదిస్తున్న వృద్ధుడు

అనంతరం వెల్కిచర్లలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శుభ్రం చేసిన ధాన్యాన్ని వెంటనే ఎత్తాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీడీవో ప్రభాకరాచారి, తాసీల్దార్ జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు మహేశ్‌యాదవ్, రజిత, ఏఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.


భట్టుపల్లిలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

*రెవెన్యూ సదస్సుల పరిశీలన*

మూసాపేట, మే 7: మండలంలోని పోల్కంపల్లి, సంకలమద్దిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సదస్సులకు వెళ్లి అధికారులు, ప్రజలతో మాట్లాడారు. భూములకు సంబంధించిన సమస్యలు ఏమున్నా భూభారతి ద్వారా పరిష్కరించుకోవచ్చని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించే మార్గం ఉందని, ప్రతి దరఖాస్తును పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతువేదిక నిర్మించాలి

నారాయణపేట, మే 7 : రైతుల సౌకర్యార్థం జిల్లాకేంద్రంలో రైతు వేదికను నిర్మించాలని బీకేఎస్ జోనల్ కార్యదర్శి వెంకోబా డిమాండ్ చేశారు. బుధవారం బీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు ఆయన మాట్లాడుతూ.. సింగారం గ్రామంలో ఉన్న రైతు వేదిక పట్టణానికి వర్తిస్తుందని తెలిపారు. వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే రైతులు అక్కడికి వెళ్లలేకపోతున్నారని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో నెలకొన్న గన్నీ బ్యాగుల కొరతను తీర్చాలన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలప్ప, కార్యదర్శి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి ప్రభుమిస్కిన్, నగర అధ్యక్షుడు వెంకటప్ప, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, కార్యదర్శి అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయాలి

నారాయణపేట, మే 7 : నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే రైతు ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి కోరారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ధర్నాకు రైతులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రశాంత్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ, అరుణోదయ జిల్లా కార్యదర్శి అంజి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలి

హన్వాడ, మే 7: కార్మికుల చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాయినోనిపల్లి, తిరుమలగిరిలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సమ్మెలో ప్రతికార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు రాములు, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు హరిచందర్, మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పాం సాగుపై అవగాహన


క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జడ్చర్ల(మిడ్జిల్), మే 7: మిడ్జిల్ మండలం వస్పులలో ఆయల్‌పాం తోటల సాగుపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ, ప్రియూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ జడ్చర్ల క్లస్టర్ అధికారి మహేందర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పాం తోటల పెంపకానికి ప్రభుత్వం అన్నివిధాలుగా సాయం అందిస్తుందన్నారు. ఆసక్తిగల రైతులు ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రేనయ్య, క్లస్టర్ అధికారి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## రూ.2,155 @ పలికిన సోన

నారాయణపేట టౌన్, మే 7 : జిల్లాకేంద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం 3,261 క్వింటాళ్ల సోనా విక్రయానికి రాగా క్వింటాకు గరిష్టంగా రూ.2,155 కనిష్టంగా రూ.1,539 ధర పలికాయి. అదేవిధంగా 238 క్వింటాళ్ల హంస రకం విక్రయానికి రాగా క్వింటాకు గరిష్టంగా రూ. 1,829, కనిష్టంగా రూ.1,450 ధర పలికాయి. 4 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటాకు రూ. 6,691 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

## వ్యవసాయ బోర్ మోటర్ అపహరణ

మక్తల్, మే 7: ఆరుగాలం చెమటోడుస్తున్న రైతుల వ్యవసాయ మోటర్లను దుండగులు అపహరిస్తున్న ఘటన మక్తల్ మండలం ముష్టిపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ముష్టిపల్లి వద్ద జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో మోటర్లు అమర్చుకొని రైతులు పంటలు పండించుకుంటుండగా.. దుండగులు అపహరించుకెళ్తున్నట్లు వాపోయారు. రైతు మేకల లక్ష్మన్నకు చెందిన రెండు మోటర్లు, స్టార్టర్‌తోపాటు పైపు ఎత్తుకెళ్లారు. మంగళవారం రాత్రి బీఆర్ఎస్ నాయకుడు, రైతు కూర ఆనంద్ చెందిన మోటర్, స్టార్టర్, పైప్‌లైన్‌తో సహా ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లారు. తరచూగా 15రోజుల వ్యవధుల్లో ముగ్గురు రైతులకు సంబంధించిన వ్యవసాయ మోటర్లు, పైపులను ఎత్తుకెళ్తున్న దొంగలను పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ ఘటనపై మక్తల్ పోలీసులకు ఫిర్యాదులు అందజేస్తామని బాధిత రైతులు తెలిపారు.

## బాధితులకు పరిహారం చెల్లించాలి

జడ్చర్ల, మే 7: జడ్చర్ల ఫ్లైవర్ నుంచి సిగ్నల్‌గడ్డ వరకు రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని బుధవారం బాధితులు జడ్చర్ల తాసీల్దార్‌కు వినతి చేశారు. రెండేండ్ల కిందట జాతీయ రహదారి 167 రాయిచూర్–మిర్యాలగూడ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మా ఇండ్లు కోల్పోయామని, ప్రభుత్వం ఇప్పటి వరకు తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సంజీవరెడ్డి, కలీం, నాగమణి, హకీం, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి


చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణ పేట రూరల్, మే 7 : చెక్‌పోస్టుల దగ్గర పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ లింగయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం జబాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 7 చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కర్నాటక నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యాన్ని తీసుకురాకుండా తగుచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కర్నాటక నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షున్నంగా తనిఖీ చేయాలన్నారు.

## గురుకుంట భజన మండలికి జిల్లాస్థాయి ప్రథమ బహుమతి

నవాబ్‌పేట, మే 7: మండలంలోని గురుకుంట వీరాంజనేయ భజన మండలి జిల్లాస్థాయి భజన పోటీల్లో ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచింది. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి భజన పోటీల్లో గురుకుంట భజన మండలి కళాకారులు పాటల రూపంలో తమ ప్రతిభను కనబర్చి మొదటి బహుమతి గెలుపొందారు. గురుకుంట భజన మండలి సభ్యులను పోటీల నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు నారాయణ, రాజు, వెంకటయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

## రైల్వే ప్రైవేటీకీకరణ నిలిపివేయాలని నిరసన

మహబూబ్‌నగర్ అర్బన్, మే 7: రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన విరమించుకొని ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి, మధ్య తరగతి ప్రజలు ప్రయాణించే బోగీల సంఖ్య పెంచాలన్నారు. దేశంలో వరసగా జరుగుతున్న రైలు ప్రమాదాలపై కేంద్రం దృష్టిపెట్టకుండా కార్పొరేట్లకు లాభం చేకూర్చేందుకు ప్రైవేటీకరణ గురించి ఆలోచిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే విస్తరణ, భద్రతకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమరలీ, చంద్రకాంత్, సయ్యద్‌గౌస్, జహంగీర్, భరత్, శ్రీనివాసులు, గాలన్న, బాబుమియా పాల్గొన్నారు.


నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

## క్రీడలతోనే ఆరోగ్యం

మక్తల్, మే 7: క్రీడలు ఆడడంతో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండడంతోపాటు ఉల్లాసంగా ఉంటారని నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం అన్నారు. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్ నుంచి పట్టణ పురవీధుల్లో విద్యార్థుల చేత భారీ ఎత్తున వేసవి శిక్షణ శిబిరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ పొందుతున్న 60మంది విద్యార్థులకు సొంతఖర్చుతో రూ.18వేలను వెచ్చించి విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం శిక్షకులు రాఘవేందర్, రమేశ్‌కుమార్, భీంరెడ్డి, జాతీయ స్థాయి క్రీడాకారులు మధుప్రియ, మహేశ్వరి, గౌతమ్, వెంకటేశ్, అంజలి, బాలబాలికలు తదితరులు ఉన్నారు.


మక్తల్ ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

*క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి*

నారాయణపేట టౌన్, మే 7: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మంతు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ అన్నారు. వరల్డ్‌కిడ్స్ అథ్లెటిక్స్‌డే సందర్భంగా బుధవారం మినీస్టేడియంలో అండర్–8 నుంచి 14, అండర్ 12 నుంచి 14 విభాగాల్లో కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను జెండా ఊపి మాట్లాడారు. తమకు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నందూనామాజీ, కోచ్ హారికదేవి, పీఈటీ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మక్తల్, మే 7 : క్షణికావేశానికి గుర్రై ఉరేసుకొని మహిళ మృతి చెందిన ఘటన జక్లేర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి వివరాల మేరకు ఇలా ఉన్నాయి.. మండలంలోని జక్లేర్ గ్రామానికి చెందిన కొంకలి జయమ్మ (34), భర్త కొంపల్లి శివకు 14 ఏండ్ల క్రితం వివాహమైంది. మంగళవారం జయమ్మ మద్యం తాగి పొలానికి రావడంతో భర్త శివతో గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గుర్రై జయమ్మ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తమ్ముడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక టిప్పర్ల పట్టివేత


మాగనూరు/కృష్ణ, మే 7 : అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లను తాసీల్దార్ పట్టుకున్న ఘటన మండలంలో చోటు చేసుకున్నది. మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రిప్పర్లను కృష్ణ తాసీల్దార్ వెంకటేశ్ పట్టుకున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు.. కృష్ణానది నుంచి అక్రమంగా రాత్రివేళల్లో ఇసుక తరలిస్తున్నారన్నారు. మంగళవారం చేగుంట సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అర్ధరాత్రి సమయంలో తాసీల్దార్ వెంకటేశ్, వారి సిబ్బందితో కలిసి రెండు ఇసుక టిప్పర్లను పట్టుకొని బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి కేసులు నమోదు చేయకుండా ఫైన్‌వేసి వదిలేయడంతో ఇసుక రవాణాపై సంబంధిత అధికారులు హస్తమున్నట్లు గ్రామస్తులు స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై నవీద్‌ను వివరణ కోరగా.. తాసీల్దార్‌ను వివరాలు అడగాలని తెలిపారు. ఈ విషయమై తాసీల్దార్ వెంకటేశ్‌కు ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## ఘనంగా వాసవీమాత జయంతి

మరికల్, మే 7 : మండలకేంద్రంలోని కన్యాకపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యాక్రమంలో సంఘం నాయకులు, వాసవిక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

*ధన్వాడమండలంలో..*

ధన్వాడ, మే 7 : వాసవీమాత జయంతిని బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో అమ్మవారి చిత్రపటానికి ఆర్యవైశ్యలు ప్రత్యేక పూజాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మరికల్: సామూహిక కుంకుమార్చనలో మహిళలు

## గురుకుల విద్యార్థికి అభినందన


జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, మే 7: దేవరకద్ర మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి జ్ఞానేశ్వర్‌ను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం అన్నసాగర్‌లో అభినందించారు. మూసాపేట మండలంలోని సంకలమద్దికి చెందిన కోట్ల రవి కుమారుడు జ్ఞానేశ్వర్ దేవరకద్ర మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థిని శాలువాతో సన్మానించారు.

## రథోత్సవంలో పాల్గొన్న మాజీఎమ్మెల్యే


రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

కృష్ణ, మే 7 : మండలంలోని ఆలంపల్లి గ్రామంలో బుధవారం మారెమ్మదేవి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, నేతాజీరెడ్డి, అంజి, ఆంజనేయులు, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి గుర్రై వ్యక్తి మృతి

నవాబ్‌పేట, మే 7: మండలంలోని సిద్దోటంలో విద్యుదాఘాతానికి గుర్రై మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య(70) నాలుగేండ్ల నుంచి కామారం శివారులో హర్షవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి మామిడి తోటలో పని చేస్తుండేవాడు. కాగా ఈనెల 5వ తేదీన మామిడి తోటలో పనికి వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. మరుసటిరోజు వెంకటయ్య ఆచూకీ కోసం బంధువుల వద్ద వెతికారు. బుధవారం ఉదయం మామిడి తోటలో వెతకగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శవం లభించింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రిపేరు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గుర్రై మృతిచెంది ఉంటాడని ఎస్సై వివరించారు. మృతుడి భార్య బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వడ్ల ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరు..

ఊట్కూర్, మే 7: బైక్‌పై వెళ్తూ రోడ్డు పక్కన నిలిపిన వడ్ల ట్రాక్టర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని ఓబులాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శ్రీరాంనగర్ వీధిలో నివాసముంటున్న కంసాని రాజు(40) నారాయణపేట పట్టణ సమీపంలోని హోటల్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం హోటల్ నుంచి బైక్‌పై గ్రామానికి తిరిగి వస్తున్నాడు. అయితే గాయత్రి రైస్ ఇండస్ట్రీకి వడ్ల లోడుతో వచ్చిన వాహనాలు మెయిన్ రోడ్డుపై బారులు తీరాయి. రాజు బైక్‌పై ప్రమాదవశాత్తు వడ్ల లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని వెనుక వైపు నుంచి బలంగా ఢీ కొట్టాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కూతుర్లున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణంరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, కాంగ్రెస్ నాయకులు లింగం, కొక్కు శంకర్ తదితరులు పరామర్శించారు.

## రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య

మరికల్, మే 7 : రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన బుడ్డ (26) గత కొన్ని రోజులుగా పస్పుల గ్రామంలో బోరుబండిపై పనులు చేస్తున్న జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం మద్యం మత్తులో గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి మహబుబ్‌నగర్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించినట్లు రైల్వేపోలీసు రామకృష్ణ తెలిపారు.

## వేసవిశిక్షణ శిబిరం పరిశీలన

మరికల్, మే 7 : మండల కేంద్రంలో బాలికల, పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తూన్న వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం డీఈవో గోవిందరాజులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో శిక్షణపై ఆరా తీశారు. విద్యార్థుల ఆసక్తి, నైపుణ్యం గూర్చి ఆడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మనోరంజనీ, హెచ్ఎం నాగరత్నమ్మ , ఎంఐఎస్ కోర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకులలో ప్రారంభం

మూసాపేట, మే 7: అడ్డాకుల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈవో కురుమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బుధవారం 21వ తేదీ వరకు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎం జ్యోతి, వలంటీర్లు ఉన్నారు.